క్లుప్తంగా

నేడు చెక్కుల పంపిణీ

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్ క్లస్టర్ పరిధిలో పంట నష్టపరిహారం చెక్కులను నేడు (సోమవారం) అందించనున్నట్లు ఏఓ బోగ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అశోక్‌నగర్ క్లస్టర్ పరిధిలోని అశోక్‌నగర్, దబ్బీర్‌పేట, చిలుకమ్మతండా, ఈర్యతండా, పర్శతండాలకు చెందిన 351మంది రైతులకు చెందిన 160హెక్టార్ల విస్తీర్ణంలో 2022సంవత్సరంలో పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. వీటికి రూ.20లక్షల 19వేల 940లు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా అందించనున్నట్లు పేర్కొన్నారు.

మిత్రుల చేయూత



రాయపర్తి : మండలంలోని బురహాన్‌పల్లి గ్రామానికి చెందిన చెంగర రాజు ఇటీవల మృతి చెందాడు. కాగా రాజు భార్య కవితతో కలిసి చదువుకున్న మిత్రులు ఆదివారం రూ.15 వేల ఆర్థికసాయం అందించి చేయూత నిచ్చారు. కార్యక్రమంలో అబ్బోజు పూర్ణాచారి, నిమ్మల అశోక్, మూనావత్ రమేష్, పడాల సంతోష్, కొమ్ము శ్రీనివాస్, జక్కం సందీప్ కుమార్, బొల్లం రాజు, భాషబోయిన నాగరాజు, సుతారి రాజు, గడిపల్లి ప్రభావతి, అనిత, బండి అనిత, గడిపెల్లి సంధ్య పాల్గొన్నారు.

విరాళం అందజేత

వరంగల్(పర్వతగిరి) : కంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన వర్ధినేని సరళ–భూపాల్‌రావు వారి తల్లిదండ్రులు రాధమ్మ–చలపతిరావు జ్ఞాపకార్థం రూ.50వేల 116లు ఆదివారం గీతపారిశ్రామిక సహకార సంఘానికి అందజేశారు.

సన్మానం



రాయపర్తి : సామాజిక ఉద్యమాల్లో కళాకారుల పాత్ర కీలకమని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పేర్కవేడులో తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి నంది అవార్డు గ్రహీత తాటికాయల శ్రీనివాస్ దంపతులకు ఆత్మీయ సమ్మేళన సన్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నాల తారశ్రీ, ఎంపీటీసీ బండి అనూష, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, వార్డు మెంబర్లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అభినందనీయం



సంగెం : గ్రామీణ ప్రాంతంలో విద్యాసంస్థను నెలకొల్పి లాభాపేక్షతో కాకుండా 25 ఏళ్లుగా సేవా దృక్పథంతో విద్యనందించడం అభినందనీయమని ఎంపీపీ కళావతి అన్నారు. శనివారం రాత్రి మండలంలోని మొండ్రాయిలోని సిద్ధార్థ హైస్కూల్‌లో సిల్వర్‌జూబ్లీ ఉత్సవాలను నిర్వహించారు.

12రకాల సరుకులు పంపిణీ చేయాలి

గూడూరు : ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా 12రకాల సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పైండ్ల యాకయ్య డిమాండ్ చేశారు. మండలంలోని అప్పరాజ్‌పల్లి రేషన్ షాపు వద్ద ఆదివారం రాయితీలు కార్పొరేటర్లకు కాదు, పేదలకు ఇవ్వండి అంటూ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకలు సాయిలు, మల్లయ్య, వెంకన్న పాల్గొన్నారు.

రేపు నిరసన దీక్ష

వర్ధన్నపేట : హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఈనెల 18న తలపెట్టిన నిరుద్యోగ నిరసన దీక్షను విజయవంతం చేయాలని తెలంగాణ జనసమితి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలిశాల రాజేష్ ఆదివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రంలో విద్య, గ్రూప్ పరీక్షలు వ్యాపారంగా మారిపోయాయని పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

రామన్నపేట: జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ములుగురోడ్డు సమీపంలోని గార్డియన్ ఆస్పత్రిలో సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వరంగల్ అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ ఎ.శ్రీనివాసరావు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల్లో మృతి చెందిన వారి జ్ఞాపకార్థం ప్రతిఏటా ఏప్రిల్ 14నుంచి 20వ తేదీ వరకు జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్, ఆస్పత్రి సిబ్బంది ఆజాద్, ఎస్.వెంకటేశ్వర్లు, రాజేశ్వర్, బి.యాదగిరి, బి.గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసింహాల స్వైరవిహారం

- గుంపులుగా కుక్కల సంచారం
- పిల్లలు, వృద్ధులు, వాహనదారులపై దాడులు
- బయటకు రావాలంటే జంకుతున్న జనం
- నిర్మూలన చర్యలు చేపట్టాలని వేడుకోలు



చింతలపల్లిలో గుంపులుగా కుక్కలు

సంగెం : గ్రామాల్లోని కుక్కలు ప్రజలపై పగబడుతున్నాయి.. దారి వెంట వచ్చి, పోయే వారిని వెంబడించి గాయపరుస్తున్నాయి.. గుంపులు గుంపులుగా చేరి వాహనదారులు, ప్రయాణికులు, బాటసారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.. సంగెం మండల కేంద్రంతో పాటుగా అన్ని గ్రామాల్లోను కుక్కల బెడద ఎక్కువగా ఉంది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వారానికి కనీసం మూడు, నాలుగు కేసులు నమోదు అవుతున్నాయి. ఇటీవల చింతలపల్లి గ్రామానికి చెందిన శ్రీనుకు కుక్క కాటు వేసింది, అలాగే శనివారం వేల్పుల రాజ్‌కుమార్ అనే చిన్నారిని కుక్కలు తీవ్రంగా కాటు వేయడంతో 14కుట్లు పడి ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. అదే రోజున అదే గ్రామానికి చెందిన చాపర్తి వెంకటలక్ష్మి అనే వృద్ధురాలిని సైతం కాటు వేసింది. మండలంలో ప్రజలతో పాటు పశువులపై కుక్కలు దాడి చేస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు సంగెం పీహెచ్‌సీలో 26 కుక్క కాటుతో గాయపడి యాంటి రేబీస్ టీకాలు వేసుకున్నట్లు మండల వైద్యాధికారి అశోక్ తెలిపారు. ఇంకా పలువురు ఎంజీఎం, ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. కుక్కలకు భయపడి బయటకు రావాలంటే పిల్లలు, వృద్ధులు భయంతో వణికిపోతున్నారు. గతంలో జీపీలు కుక్కల నివారణకు చర్యలు తీసుకునేవారు. నాలుగైదు ఏళ్లుగా కుక్కల నిర్మూలనకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో శునకాల సంఖ్య విపరితంగా పెరిపోయాయని ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో స్థానికులు చేతిలో కర్ర లేకుండా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. కుక్కల బెడదను నివారించాలని చెప్పినా ఎవరు పట్టించుకున్న నాథుడే కరువయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు. కుక్కలను చంపడం నేరమని, జంతు ప్రేమికులు అధికారులపై కేసులు వేస్తుండడంతో వాటిని నియంత్రించే చర్యలు తీసుకోవడంపై వెనుకంజ వేస్తుండడంతో కుక్కల సంఖ్య పెరిగిపోతోంది. ప్రజలు, పశువులు కుక్కకాటు బారిన పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని కుక్కలను చంపకుండా వాటి నియంత్రణకు ఆపరేషన్లు వంటి చర్యలు చేపట్టాలని పలువురు వేడుకుంటున్నారు.



కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి(ఫైల్)

ఇబ్బందులు పడుతున్నాం..



ఊర్లో కుక్కల బెడద అధికంగా ఉంది. రాత్రి, పగలు తేడా లేకుండా రోడ్లపై గుంపులు గుంపులుగా చేరి వచ్చిపోయే వారిని వెంబడించి భయాందోళనకు గురిచేస్తున్నాయి. మా కొడుకు ఇంటి ముందు ఆడుకుంటుంటే తీవ్రంగా గాయపరిచింది. మా పరిస్థితి ఎలా ఉంటుందో ఏమో భయంగా ఉంది. పలువురు గాయాలపాలవుతున్నారు. ఇంట్లోంచి బయటకు రావాలంటే ఇబ్బందిగా ఉంది. వాహనదారులపైకి ఎగబడి వెంబడిస్తు వణికిస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

-వేల్పుల సంపత్, చింతలపల్లి

నియంత్రణ చర్యలు తీసుకుంటాం..



మండలంలో కుక్కలు ఎక్కువగా ఉన్నాయని ఫిర్యాదులు వస్తున్నాయి. జీపీ పాలకవర్గాల తీర్మానాల మేరకు వాటిని బంధించి అడవిలో వదిలేయడం, లేకపోతే వాటికి ఆపరేషన్లు చేయించాల్సి ఉంది. కుక్కలకు కు.ని ఆపరేషన్లు చేయించాలంటే జీపీల నుంచి నిధులు వాడుకునేలా అనుమతి కోరుతూ డీపీఓకు లేఖ రాశాం. అనుమతి రాగానే పశువైద్యుల ద్వారా వాటికి ఆపరేషన్లు చేయించి కుక్కల నియంత్రణ చర్యలు చేపడతాం.

- కొమురయ్య, ఎంపీఓ, సంగెం

ముస్లింలకు ఇఫ్తార్ విందు



నమాజ్‌లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ముస్లింలు

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని మస్‌జీదే మహ్మదీయ మసీద్‌లో ఆదివారం సాయంత్రం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నమాజ్ తర్వాత ఖర్జూర, అరటి, అంగూర, పుచ్చకాయలతో ఇఫ్తార్ నిర్వహించారు. విందులో ఎస్సై తోట మహేందర్, సర్పంచ్ సుంకరి లావణ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫి, మండల కోఆప్షన్ సభ్యులు ఎం గఫ్ఫార్, జున్నూతుల రాంరెడ్డి, నాయకులు కంది కృష్ణ చైతన్య, అధ్యక్షుడు బషీర్, మజీదే మహ్మదీయ కమిటీ సదర్ షేక్ యాకూబ్ పాషా, ఎండీ అయూం, వలీ, యాకూబ్, జాను, కరీం, హైదర్, తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ అంటేనే భరోసా

ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : బీఆర్‌ఎస్ అంటేనే సామాన్యులకు భరోసా అని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. దామెర క్రాస్‌రోడ్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం పరకాల మండలంలోని వెంకటాపురం, హైబోత్‌పల్లె, లక్ష్మీపురం, మల్లక్కపేట, నాగారం గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. అన్ని వర్గాలకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా నిలుస్తున్నదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై బీజేపీ నాయకుల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని రైతుల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. అనేక సంక్షేమ పథకాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. తెలంగాణలో అమలు అయ్యే పథకాలు ఏ ఒక్క బీజేపీ పాలిత రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదన్నారు. కేంద్రప్రభుత్వానికి ప్రజలపై ప్రేమ ఉంటే గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రతి బీఆర్‌ఎస్ కార్యకర్త గ్రామాలలో సైనికుడిలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, జెడ్పీటీసీ చిలువేరు మొగిళి, నాయకులు నేతాని శ్రీనివాస్‌రెడ్డి, సాంబరెడ్డి, బొజ్జం రమేష్, మునిగల సురేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరికలు..

పరకాల మండలం హైబోతుపల్లెకు చెందిన మీరాసాహెబ్, రఫీక్, సుకుర్‌తో పాటు పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరిని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

నల్లబెల్లి : మండలంలోని నాగరాజుపల్లి శివారు ఒల్లె నర్సయ్యపల్లిలో సర్పంచ్ గొనె శ్రీదేవి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ.. నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహకారంతో చేపడుతున్న గ్రామాభివృద్ధిలో స్థానికులు భాగస్వాములు కావాలని కోరారు.కార్యక్రమంలో నాయకులు గందె శ్రీనివాస్ గుప్తా, వల్లే పర్వతాలు, కదురు మోహన్, చెంచు దేవి, చిట్యాల సీతారాం రెడ్డి, రాజిరెడ్డి, పైడి, వెంకన్న, కుమార్, మల్లయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉండాలి



గ్రామకమిటీ అధ్యక్షుడికి నియామక పత్రం అందజేస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

పరకాల : చేనేత కార్మికుల సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషిచేయాలని పద్మశాలీ సంఘం పరకాల, నడికూడ మండలాల అధ్యక్షులు దాసరి భిక్షపతి, గాదె శంకరయ్య డిమాండ్ చేశారు. పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు, ప్రొఫెసర్ చందా మల్లయ్య ఆదేశాల మేరకు పద్మశాలీ సేవా సంఘం పోచారం, వెల్లంపల్లి గ్రామ కమిటీలను ప్రకటించారు. వెల్లంపల్లి గ్రామ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారిగా ఐతే సాంబయ్య, బంక రవి, బొడ్డుల సదానందం, పోచారం గ్రామ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారిగా గడ్డం చంద్రమౌళి, దోమల చంద్రమౌళి, దాసీ వెంకటేష్‌లను ఎన్నుకున్నారు. అదేధంగా సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారిగా ఎన్నికైన వారికి రాష్ట్ర స్థాయి ఎన్నికలలో పోటీ చేసే అవకాశం ఉంటుందన్నారు. పరకాల, నడికూడ పద్మశాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎర్రబెల్లి మదన్‌మోహన్‌రావు

దుగ్గొండి : ప్రతిరోజు గ్రామాలలో నిరంతర సేవలందిస్తున్న ఆశ కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులకు ఈజీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రస్టు చైర్మన్ ఎర్రబెల్లి మదన్‌మోహన్‌రావు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో గ్రామీణ ప్రాంతాలలో నిరంతర సేవలందిస్తున్న ఫ్రంట్ లైన్ వారియర్స్‌కు సమాజం రుణపడి ఉంటుందన్నారు. ఎవరికి ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో నార్లగిరి రామలింగం, ఎరుకొండ కరుణాకర్, మాచర్ల రమేష్, ముక్కల రాజు, బూతం మధు, దూడయ్య, దేవేందర్, రమేష్, సీతారాములు, శ్రీను, పవన్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ‘మోడల్’ ప్రవేశ పరీక్ష

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఎంఈఓ రత్నమాల తెలిపారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ.. 6వ తరగతిలో ప్రవేశాలకు 108మంది దరఖాస్తు చేసుకోగా 75 మంది హాజరయ్యారు. 7వ తరగతికి 18మంది, 8వ తరగతికి 10మంది, 9వ తరగతికి 14మంది, 10తరగతికి 3 దరఖాస్తు చేసుకోగా 3 హాజరయ్యారని తెలిపారు. మోహన్‌రావు, ప్రసన్నలక్ష్మీ, సీఆర్పీలు సంపత్, శిల్ప ఉన్నారు.

ఖాళీలను భర్తీ చేయాలి

కేయూ క్యాంపస్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ నిర్వహించింది నిరుద్యోగుల మార్చ్ కాదని బీజేపీ కార్యకర్తల మార్చ్ అని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బీఆర్‌ఎస్‌వీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర, కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ ఎద్దేవాచేశారు. చిత్తశుద్ధి ఉంటే కేంద్రంలోని వివిధ శాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్‌వీ సమావేశంలో వారు మాట్లాడారు.

సమస్యల కొలిమిలో కమ్మరులు



పనిముట్లు తయారీ చేస్తున్న కమ్మరి

- పరికరాలకు ఆదరణ కరువు..
- ఇబ్బందులు పడుతున్న వృత్తిదారులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

నెక్కొండ : ప్రపంచీకరణ నేపథ్యంలో కుల వృత్తులకు నానాటికి ఆదరణ తగ్గుతోంది. ఒకప్పుడు వెలుగు వెలిగిన ఆయా కులవృత్తుల వారు.. నేడు పొట్ట నింపుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. తరతరాలుగా అదే వృత్తిని నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న అనేక కుటుంబాలు నేడు వేరే వృత్తిని చేపట్టలేక అందులోనే మగ్గుతూ.. అవస్థలు పడుతున్నారు. కమ్మరులు ఇనుమును కరిగించి దానికి రూపం తీసుకొచ్చి వివిధ పనిముట్లను తయారు చేయడం ప్రధాన పని. కమ్మరులు ప్రధానంగా వ్యవసాయదారులకు ఉపయోగపడే వివిధ రకాల పని ముట్లు పారలు, కొడవళ్లు, కత్తులు, గొడ్డళ్లు, కత్తిపీటలు, గడ్డపారలు, నాగలి కర్రులు, గుంటుకలకు ఉపయోగపడే కర్రులు తదితర వాటిని తయారుచేస్తూ జీవనం సాగించే వారు. దీంతో వృత్తిదారులకు గతంలో డిమాండ్ ఉండేది. ప్రస్తుతం ఆధునిక వ్యవసాయ పనిముట్లు యంత్రాలపై తయారు చేసినవి రావడంతో కమ్మరులకు క్రమేపి డిమాండ్ తగ్గుతోంది. రైతులు ఆధునిక పనిముట్ల వైపు మొగ్గు చూపుతున్నారు. యంత్రాలపై తయారుచేసిన వ్యవసాయ పనిముట్లు తక్కువ ధరకు లభ్యమవుతుండడంతో కమ్మరులకు పనిలేకుండా పోతోంది. తరతరాలుగా కమ్మరి వృత్తిని నమ్ముకొని బతుకుదుతున్న వారి పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుతం వ్యవసాయ పనిముట్లకు సానపట్టడం లాంటి వాటికే కమ్మరులు పరిమితమై పోతున్నారు. గతంలో ఎడ్లబండ్ల చక్రాలకు ఉండే ఇనుపపట్టీలను బిగుతుగా చేయడం, ఎడ్ల కాళ్లకు వేసే నాన్లను తయారుచేయడం జరిగేది. ప్రస్తుతం కమ్మరి వృత్తికి ఆదరణ కరువైంది. ఇనుప పనిముట్లను సానపెట్టేందుకు వినియోగించే బొగ్గులు దొరకడం లేదు. గతంలో ప్రతీ ఇంట్లో కట్టెలను వినియోగించి వంటకాలు చేయడంతో బొగ్గులు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్లతో వంటలు చేస్తుడడంతో బొగ్గులు అందుబాటులో లేకుండా పోయాయని వారు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందక పోవడంతో కుల వృత్తులు ఆదరణ కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



కమ్మరులకు ప్రభుత్వం ఎలాంటి ఆర్థికసాయం అందించడం లేదు. ప్రభుత్వం కమ్మరుల పట్ల చిన్నచూపు చూస్తోంది. రెండు పర్యాయాలు బ్యాంక్ రుణం కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు చేయలేదు. కమ్మరులకు పనులు లేక కుటుంబాలను పోషించేందుకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. రోజు రూ.వంద నుంచి రూ.150 సంపాదించడం గగనమవుతుంది. ప్రభుత్వం ఆదుకొని బ్యాంక్ రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం దయతలచి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలి.

- సంజయ్, కమ్మరి వృత్తిదారుడు

వారంలో ఇన్‌పుట్ సబ్సిడీ జీఓ

- నియోజకవర్గంలో 37,498 ఎకరాల్లో పంట నష్టం
- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : వడగళ్ల వర్షంతో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఆర్థికసాయానికి సంబంధించిన జీఓ మరో వారం రోజుల్లో విడుదల కానుందని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉత్తర యుద్ధం కార్యక్రమం, 2023లో కురిసిన వడగళ్ల వర్షానికి సంబంధించిన ఇన్‌పుట్ సబ్సిడీ(పంట నష్టం) వివరాలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వడగళ్ల వర్షం వల్ల నష్టపోయిన పంటలను పరిశీలించడానికి నర్సంపేట నియోజకవర్గ పర్యటనకు ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా వచ్చారని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సంబంధిత వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నష్టపరిహారం నివేదిక కలెక్టర్ పంపడం జరిగిందని తెలిపారు. నర్సంపేట డివిజన్‌లో అన్ని పంటలు కలుపుకొని 32,649మంది రైతులకు గాను 37,498ఎకరాలలో పంట నష్టం జరిగిందని పేర్కొన్నారు. గత సంవత్సరం 2022లో వడగళ్ల వర్షం పంట నష్టపోయిన రైతులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం దాదాపు 50శాతం పూర్తయిందని, మిగిలిన వారికి కూడా త్వరలోనే అందజేస్తామన్నారు. సమావేశంలో ఎస్ఆర్‌ఈజీఎస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ లింగయ్య, కో చైర్మన్లు వెంకట్ రామిరెడ్డి, మోహన్‌రావు, రాజు, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ల జిల్లా అధ్యక్షుడు స్వామి చౌహాన్, డివిజన్ అధ్యక్షుడు, ఆరు మండలాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకాన్ని వర్తింపజేయాలి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పట్టణ పరిధిలో కూడా వర్తింప చేసి వ్యవసాయ కూలీలకు ఆర్థికంగా చేయూత కల్పించి వారిని ఆదుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని ద్వారకపేట 6, 7వార్డు, సర్వాపురం 4, 5వార్డులు, కమలాపురం 2వ వార్డులో నివసిస్తున్న వ్యవసాయ కూలీలకు కూడా ఉపాధి హామీ పథకాన్ని వర్తింప చేయాలన్నారు. ఆదివారం పట్టణ ప్రజలచే పోస్టల్ కార్డు ద్వారా ప్రధాని నరేంద్రమోదీకి సందేశాన్ని పంపి నిరసన వ్యక్తం చేసే ఉత్తర యుద్ధం కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని పేదలు కూడా ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధిపొందే విధంగా వారికి వీలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో నర్సంపేట మున్సిపాలిటీగా ఏర్పడక ముందు ద్వారకపేట, సర్వాపురం, కమలాపురం, నర్సంపేట పట్టణంలో ఉపాధి హామీ పని ఉండేదని తెలిపారు. ఉపాధి హామీ కూలీ రేట్లు పెంచి పని ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలను అందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి బడ్జెట్‌లో రూ.30వేల కోట్లు నిధులు తగ్గించడంతో ఉపాధి కూలీ పని దినాలు తగ్గాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, నాయకులు లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, గోనె యువరాజు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, పట్టణ నాయకులు, క్లస్టర్ బాధ్యులు, మున్సిపల్ పరిధిలోని వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

దళిత కాలనీల్లో విద్యుత్ సరఫరా బంద్

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లోని దళిత కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ కాలనీల్లోని కొంతమంది వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారని అధికారులు గుర్తించి కరెంట్ కనెక్షన్ కట్ చేశారు. అవసరమైతే కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ 220 ఎస్సీ కుటుంబాలు ఉండగా, 160 కుటుంబాలు మాత్రమే విద్యుత్ సర్వీస్‌ను కలిగి ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. సర్వీస్ లేని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు రూ.వేయితో పాటు కులం, ఆధార్‌కార్డు సమర్పించాలని సూచించారు. అయినప్పటికీ ఆ కుటుంబాలు స్పందించపోగా, విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నాయి. ఈక్రమంలో నాగారం సబ్‌స్టేషన్ ఏఈ తరుణ్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణతో పాటు సిబ్బంది ఎస్సీ కాలనీల్లో ఆదివారం పర్యటించారు. కరెంట్ లేక తాము రెండు రోజులుగా చీకటిలో మగ్గుతున్నామని అధికారుల ఎదుట వాపోయారు.

అంబేడ్కర్ సంఘం కార్యవర్గం ఎన్నిక



మడికొండ: మడికొండ అంబేడ్కర్ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎడబోయిన ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా జవ్వాజి కిషన్, కోశాధికారిగా మూల ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా రొడ్డ దయాకర్, జిట్ట అనిల్, కాగిల శంకర్, సహాయ కార్యదర్శిగా మూల నవీన్‌కుమార్, మద్దెల కుమార్, గుండాల రమేష్, దార సతీష్, కార్యవర్గ సభ్యులుగా జానపట్ల రాజు, అక్కపెల్లి వెంకటస్వామి, అంకేశ్వరపు రాము, జిట్ట సదానందం, దాసరి ప్రణీత్, నెలకంటి వెంకటేష్, చెన్నమల్ల భాస్కర్ ఎంపికయ్యారు. యూత్ అధ్యక్షుడిగా అంకూస్ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా దార ధనుంజయ్‌ను ఎన్నుకున్నారు.